మాట్లాడుతున్న జడ్పీచైర్‌పర్సన్ నాగజ్యోతి

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ములుగు రూరల్, ఫిబ్రవరి 12 : మేడారం జాతరలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. జడ్పీ సీఈవో ప్రసూనారాణి అధ్యక్షతన సోమవారం స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగజ్యోతి అధికారులనుద్దేశించి మాట్లాడుతూ రైతులందరికీ రైతు బంధు, రైతు బీమా వర్తింపజేయాలన్నారు. పశువులకు కృత్రిమ గర్భధారణపై ఆ శాఖ అధికారులు వైద్య శిబిరాలు నిర్వహించాలని అన్నారు. రైతులకు సబ్సిడీ యంత్రాలను అందించాలన్నారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీ పనిముట్లు, వాహనాలను పంపిణీ చేయాలని తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, టిఫిన్ అందించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని, వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలన్నారు. మహిళలకు లింకేజీ రుణాలు అందించాలని నాగజ్యోతి సూచించారు. సమావేశంలో జడ్పీటీసీలు రుద్రమదేవి, పుష్పలత, రమణ, కరమ్‌చంద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిచ్చెన పైనుంచి జారిపడి బాలుడి మృతి

యర్మ తేజ(ఫైల్)

వాజేడు, ఫిబ్రవరి 12 : ప్రమాదవశాత్తు ఓ బాలుడు డాబా పైనుంచి దిగుతూ జారి పడడంతో మృతిచెందాడు. బంధువుల కథనం ప్రకారం.. మండలంలోని కడెకల్ గ్రామానికి చెందిన యర్మ తేజ (9) సోమవారం ఉదయం ఇంటి వద్ద డాబా పైనుంచి నిచ్చెన వేసుకొని దిగుతున్నాడు. ఈ క్రమంలో నిచ్చెన విరగడంతో జారి కిందపడడంతో తల్లిదండ్రులు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. యర్మ హరినాథ్-కృష్ణవేణి దంపతులకు ముగ్గురు పిల్లలు కాగా మొదటి సంతానం తేజ. బాలుడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

భక్తులకు ట్రాఫిక్ సమస్య ఉండొద్దు

- రోడ్డు పనుల్లో వేగం పెంచండి
- ములుగు ఎస్పీ డాక్టర్ పీ శబరీష్
- మల్లంపల్లి నుంచి గట్టమ్మ వరకు రోడ్డు పరిశీలన

గట్టమ్మ సమీపంలోని కాజ్‌వే వద్ద పనులను పరిశీలిస్తున్న ఎస్పీ శబరీష్, పక్కన ఎన్‌హెచ్ అధికారులు, సీఐ, ఎస్సై

ములుగురూరల్, ఫిబ్రవరి 12 : మేడారం జాతరకు వచ్చే భక్తులకు ఎన్‌హెచ్ విస్తరణతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పనుల్లో వేగం పెంచాలని ఎస్పీ డాక్టర్ పీ శబరీష్ ఎన్‌హెచ్, ఆర్‌అండ్‌బీ అధికారులు, ఇంజినీర్లకు సూచించారు. సోమవారం ఆయన గట్టమ్మ నుంచి మల్లంపల్లి వరకు జాతీయ రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 21 నుంచి మేడారం మహాజాతర ప్రారంభం కానున్నందున భక్తులు అధిక సంఖ్యలో ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో తరలిరానున్నారని తెలిపారు. ప్రస్తుతం ముందస్తు మొక్కులకు భారీగా భక్తులు హాజరవుతున్నారని తెలిపారు. రవాణా పరంగా జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీస్ శాఖ గట్టి చర్యలు చేపట్టిందన్నారు. ప్రస్తుతం ఎన్‌హెచ్ పనులు కొనసాగుండటంతో పాటు కాజ్‌వేల నిర్మాణ పనులు అవుతున్నందున ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశం ఉందని, సంబంధిత అధికారులు పనులను శరవేగంగా పూర్తి చేయాలన్నారు. జాకారం, మల్లంపల్లి, జంగాలపల్లి గ్రామాల వద్ద పార్కింగ్ స్థలాలను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ట్రాఫిక్ సమస్య తలెత్తితే వాహనాలను పార్కింగ్ స్థలాలకు మళ్లించనున్నట్లు చెప్పారు. ఎస్పీ వెంట డీఎస్పీ రవీందర్, సీఐ మేకల రంజిత్‌కుమార్, ఎస్సై వెంకట్‌స్వార్, ఎన్‌హెచ్, ఆర్‌అండ్‌బీ అధికారులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వైస్ చైర్మన్ ఎన్నికకు బ్రేక్

- భూపాలపల్లి మున్సిపాలిటీలో హైడ్రామా
- 13న ఎన్నిక నిర్వహించాలని ఈసీ ఆదేశం
- గడువు కోరిన ఎమ్మెల్యే సత్యనారాయణరావు

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 12 : భూపాలపల్లి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ఎన్నికలో హైడ్రామా కొనసాగుతున్నది. మంగళవారం జరగాల్సిన ఎన్నికకు బ్రేక్ పడింది. గత డిసెంబర్‌లో వైస్ చైర్మన్ కొత్త హరిబాబు రాజీనామా చేయడంతో ఆ పదవిని దక్కించుకునేందుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎత్తుకు పై ఎత్తులు వేస్తుండడంతో రాజకీయం రసవత్తరంగా మారింది. అయితే వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహణలో కలెక్టర్ నిర్లక్ష్యం వహించడంతో బీఆర్ఎస్ నుంచి ఆ పదవిని ఆశిస్తున్న గండ్ర హరీశ్‌రెడ్డి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో 13న ఎన్నిక నిర్వహించాలని కలెక్టర్ భవేశ్ మిశ్రాను ఆదేశించింది.

గడువు కోరిన ఎమ్మెల్యే

మున్సిపల్ వైస్ వైస్ ఎన్నికను బుధవారం నిర్వహించాల్సి ఉండగా, స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు గడువు కోరినట్లు సమాచారం. ఇటీవలె ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆయన వైస్ చైర్మన్ ఎన్నికలో తన ఓటు హక్కుని వినియోగించుకోనున్నారు. ఈ క్రమంలో తనకు అసెంబ్లీ సమావేశాలున్నందున ఎన్నికను వాయిదా వేయాలని ఈసీని కోరినట్లు తెలిసింది. దీంతో ఎన్నికల కమిషన్ ఎన్నికను వాయిదా వేసిందని, ఎమ్మెల్యే కోరిక మేరకు మరొక రోజున నిర్వహించనున్నట్లు సమాచారం. కాగా, ఈ ఎన్నిక విషయమై కలెక్టర్ ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.

ప్రజావాణి అర్జీలను పరిష్కరించాలి

భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ భవేశ్ మిశ్రా

భూపాలపల్లి రూరల్, జనవరి 12 : ప్రజావాణి అర్జీలను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజావాణికి డబుల్ బెడ్రూం ఇండ్లు, భూసమస్యల పరిష్కారం కోసం 31 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని, తిరస్కరణకు గురైన అర్జీ వివరాలను సంబంధిత అభ్యర్థికి తెలపాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

ములుగురూరల్, ఫిబ్రవరి12 : ప్రజావాణి దరఖాస్తులను అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ధరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మొత్తం ఏడు దరఖాస్తులు రాగా అందులో నాలుగు రెవెన్యూ, మూడు ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయన్నారు. జిల్లాలోని సంబంధిత శాఖల అధికారులకు దరఖాస్తులు సిఫారసు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో నాగపద్మజ, ఉపాధి కార్యాలయ అధికారి కుమారస్వామి, పశువైద్యాధికారి విజయ్‌భాస్కర్, లీడ్ బ్యాంకు అధికారి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలుగొద్దు

- అధికారులు నిబద్ధతతో పనిచేయాలి
- ఐటీడీఏ పీవో అంకిత్

మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ అంకిత్

ములుగు రూరల్, ఫిబ్రవరి 12 : మేడారం మహాజాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు అంకిత భావంతో, నిబద్ధతతో పనిచేయాలని ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్ సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని లీలా గార్డెన్‌లో జాతర విధుల్లో పాల్గొంటున్న అధికారులకు మొదటి విడత శిక్షణ నిర్వహించగా అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. జాతర విజయవంతానికి అధికారులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛంద సంస్థలు, మీడియా ప్రతినిధులు, అన్ని వర్గాలతో సమన్వయం చేసుకొని పనిచేయాలన్నారు. ప్లాస్టిక్ ఫ్రీ జాతరగా జరుపుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. గద్దెల వద్ద విధులు నిర్వర్తించే అధికారులు సహనం కోల్పోకుండా భక్తులకు సేవ లందించాలని తెలిపారు. పెండింగ్ పనులను పూర్తి చేసి ఏర్పాట్లను ముమ్మరం చేయాలన్నారు. అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహనతో ఆటంకాలు లేకుండా విధులు నిర్వర్తించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించలేదని ట్రాక్టర్ స్వాధీనం

మల్హర్, ఫిబ్రవరి 12 : ఐదేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు ఇవ్వకపోవడంతో విసుగు చెందిన మాజీ సర్పంచ్ ఆ జీపీ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని ఇంటికి తీసుకెళ్లిన ఘటన మండలంలోని చిన్నతూండ్ల గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ పులిగంటి మమతానర్సయ్య మాట్లాడుతూ తాగు నీరు, సైడ్ కాల్వలు, లైటింగ్ తదితర అభివృద్ధి పనులను రూ. 2.31లక్షల వ్యయంతో చేపట్టామని, ఎంబీ రికార్డు చేసి, చెక్ మెజర్ చేయించుకొని ఎంపీవోను కలువగా డబ్బులు డిమాండ్ చేశాడని, ఇవ్వకపోవడంతో పెండింగ్ పెట్టాడని ఆరోపించారు. దీంతో విసుగుచెంది సోమవారం పంచాయతీ ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ విషయమై ఎంపీవో విక్రంను ఫోన్ ద్వారా 'నమస్తే తెలంగాణ' వివరణ కోరగా స్పందించలేదు.

సమ్మక్క దేవత గద్దెను దర్శించుకుంటున్న భక్తులు

తల్లులకు మొక్కులు

తాడ్వాయి, ఫిబ్రవరి 12 : సమ్మక్క-సారలమ్మను సోమవారం భారీగా తరలివచ్చిన భక్తులు దర్శించుకున్నారు. జంపన్నవాగులో పుణ్య స్నానాలు చేసి తల్లులకు తలనీలాలు సమర్పించి నాగులమ్మ, జంపన్న గద్దెల వద్ద పూజలు చేశారు. అనంతరం గద్దెల వద్దకు చేరుకొని పసుపు, కుంకుమ, ఎత్తుబెల్లం, నూతన వస్త్రాలు, పూలు, పండ్లు, ఎత్తు బెల్లం (బంగారం) సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. భక్తుల మొక్కులతో గద్దెల వద్ద సందడి వాతావరణం నెలకొంది. గద్దెల పరిసరాలతో పాటు ఆర్టీసీ బస్టాండ్, జంపన్న వాగు, చిలకలగుట్ట తదితర ప్రాంతాల్లో భక్తులు విడిది చేశారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

ఏటూరునాగారం : మెడల్స్ సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

ఏటూరునాగారం/ మంగపేట/ వెంకటాపురం (నూగూరు), ఫిబ్రవరి 12 : ఏటూరునాగారం మండలకేంద్రంలోని గిరిజన భవన్‌లో నిర్వహించిన 6వ రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో ఏటూరునాగారం, మంగపేట, వెంకటాపురం (నూగూరు) మండలాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఏటూరునాగారం మండలం రామన్నగూడెం పాఠశాలకు చెందిన ఐ శరణ్య, జీ మైథిలి, బీ అమృత అండర్-14 కటాస్ విభాగంలో సిల్వర్ మెడల్స్ సాధించగా యాస్మిన్, స్పందనలు బ్రాంజ్ మెడల్స్ పొందినట్లు హెచ్ఎం కొయ్యడ మల్లయ్య తెలిపారు. విద్యార్థులను కరాటే మాస్టర్ అబ్బు, కరాటే బాలికల ఇన్‌చార్జి పర్వతాల రమాదేవి, ఉపాధ్యాయులు డీ సూర్యనారాయణ, జీ నర్సయ్య, రాంబాబు, దేవ, వెంకటరమణ అభినందించారు. మంగపేట మండలం కమలాపురం జడ్పీహెచ్ఎస్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు సిల్వర్ మెడల్స్ సాధించగా జ్వాలా ట్రస్టు, పాఠశాల అధ్యాపక బృందం అభినందించింది. ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే డ్రెస్సులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం గడ్డి శ్రీనివాస్, ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేశ్, ప్రధానకార్యదర్శి మునిగాల రాకేశ్, గౌరవ సలహాదారులు కోలగట్ల నరేశ్‌రెడ్డి, మునిగాల వెంకటేశ్వర్లు, వంగేటి వెంకట్‌రెడ్డి, కరాటే మాస్టర్ అబ్బు, హుస్సేన్ పాల్గొన్నారు. వెంకటాపురం (నూగూరు) మండలంలోని 66 మంది విద్యార్థులను సీఐ బండారు కుమార్, ఎస్సై రేఖఅశోక్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అభినందించారు. 35 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్ సాధించగా, 14 మంది సిల్వర్ మెడల్, 17 మంది కాంస్య పథకాలు సాధించినట్లు పాఠశాలల బాధ్యులు తెలిపారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ గొంది హనుమంత్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సింగరేణి ఇన్‌చార్జి జీఎం కవీంద్ర

నూతన ప్రణాళికలు రూపొందించాలి

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 12 : సింగరేణి సంస్థ అభివృద్ధికి మల్టీ డిపార్ట్‌మెంట్ టీమ్స్ సభ్యులు నూతన ప్రణాళికలు రూపొందించాలని భూపాలపల్లి సింగరేణి ఏరియా ఇన్‌చార్జి జనరల్ మేనేజర్ ఎస్ కవీంద్ర సూచించారు. సోమవారం కేటీకే-6 ఇంక్లైన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవీంద్ర మాట్లాడుతూ ఉత్పత్తి, ఉత్పాదకత, మిషనరీల పనితీరు, ఉత్పత్తి వ్యయం, కంపెనీ భవిష్యత్, ఉత్పత్తి లక్ష్యాలను ఉద్యోగులు, కార్మికులకు ఎప్పటికప్పుడు తెలపాలన్నారు. సమావేశంలలో ఏజీఎం ఎస్ జ్యోతి, ఏరియా ఇంజినీర్ రామకృష్ణారెడ్డి, ఏరియా అధికార ప్రతినిధి అజ్మీరా తుకారాం, కేటీకే-6 ఇంక్లైన్ మేనేజర్ శ్రీరాం భరోస్ మెహతా, ఫైనాన్స్ మేనేజర్ సురేఖ, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పౌర సరఫరాల శాఖ అధికారుల బదిలీ

ములుగు, ఫిబ్రవరి12 (నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లా పౌర సరఫరాల శాఖలో పనిచేస్తున్న అధికారులు సోమవారం రాత్రి బదిలీ అయ్యారు. సివిల్ సప్లై మేనేజర్‌గా పనిచేస్తున్న రాములు బదిలీ కాగా ఆయన స్థానంలో రామ్‌పతి నియమితులయ్యారు. డీఎస్‌వోగా అరవిందరెడ్డి బదిలీ కాగా ఆయన స్థానం వెయిటింగ్‌లో ఉంది. జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లో డీఎస్‌వో, మేనేజర్‌కు వీడ్కోలు పలికారు. విధుల్లో చేరిన నూతన మేనేజర్ రామ్‌పతికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు బాదం ప్రవీణ్, అధ్యక్షుడు కాట్రగడ్డ సతీశ్‌కుమార్, కార్యదర్శి గోపు వాసుదేవరెడ్డి, కోశాధికారి ఆరె విజేందర్, సభ్యులు ఉన్నారు.

ఐటీడీఏ పీవోగా చిత్ర మిశ్రా

అడిషనల్ కలెక్టర్‌గా అంకిత్ బదిలీ

ఏటూరునాగారం, ఫిబ్రవరి 12 : ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా నిజామాబాద్ అడిషనల్ కలెక్టర్ చిత్ర మిశ్రాను నియమిస్తూ సోమవారం రాత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పీవోగా పనిచేస్తున్న అంకిత్‌ను నిజామాబాద్ అడిషనల్ కలెక్టర్‌గా బదిలీ చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా ఈ బదిలీలు చేపట్టారు.

విద్యుత్ తీగలు అమర్చే వారి వివరాలు తెలపాలి

ములుగు రూరల్, ఫిబ్రవరి 12 : ఏజెన్సీలో వన్య ప్రాణులను వేటాడడంతో పాటు జంతువుల నుంచి పంటలను రక్షించుకునేందుకు విద్యుత్ తీగలు అమర్చే వారి వివరాలను 100కు తెలపాలని ములుగు ఎస్పీ శబరీ ష్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. వీటి వల్ల మూగ జీవాలతో పాటు మనుషులు కూడా మృత్యువాత పడుతున్నారని, అలా చేసేవారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు చేపడుతామని ఎస్పీ హెచ్చరించారు.

టిప్పర్, జేసీబీ స్వాధీనం

చిట్యాల, ఫిబ్రవరి 12 : ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న టిప్పర్, జేసీబీని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై-2 ఎండీ షాఖాన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కాల్వపల్లి గ్రామ శివారులో భూపాలపల్లి మైనింగ్ అధికారి సోమవారం తెల్లవారు జామున ఒంటి గంట సమయంలో ఇసుకను రవాణా చేస్తున్న టిప్పర్, జేసీబీని పట్టుకున్నారని, కస్టడీ కోసం వాటిని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

తాడ్వాయి, ఫిబ్రవరి 12 : అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత సోమవారం మధ్యాహ్నం మృతి చెందిన ఘటన మండలంలోని ఎల్యాకలో జరిగింది. బంధువులు, స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన భార్గవి(26) భర్త నువ్వుల దేవేందర్ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గ్రామానికి చెందిన మరో మహిళతో దేవేందర్‌కు వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఇదే విషయమై మనస్తాపానికి గురైన భార్గవి సోమవారం మధ్యాహ్నం ఒంటిపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కాగా, భర్త, కుటుంబ సభ్యులే డీజిల్ పోసి కాల్చి చంపారని మృతురాలి బంధువులు, తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యార్థులు వైజ్ఞానిక పౌరులుగా ఎదగాలి

జిల్లా విద్యాశాఖ అధికారి రాంకుమార్

మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.రాంకుమార్

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 12 : విద్యార్థులు ప్రయోగాలపై ఆసక్తి పెంచుకొని భావి భారత వైజ్ఞానిక పౌరులుగా ఎదగాలని భూపాలపల్లి విద్యాశాఖ అధికారి ఎన్ రాంకుమార్ సూచించారు. ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సైన్స్ అధికారి స్వామి ఆధ్వర్యంలో భూపాలపల్లి పట్టణంలో జిల్లా స్థాయి ప్రతిభా పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీఈవో పాటు రిటైర్డ్ అడిషనల్ కలెక్టర్ పోరిక మోహన్ లాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులకు ఆసక్తి పెరిగేలా ప్రయోగాలు చేయించాలన్నారు. ఈ సందర్భంగా పోటీలు నిర్వహించగా, పెయింటింగ్ గణపురం పాఠశాల విద్యార్థిని కే రవళి (ప్రథమ), కాటారం పాఠశాలకు చెందిన జీ వందన (ద్వితీయ), భూపాలపల్లి పాఠశాల విద్యార్థి బన్ని (తృతీయ) బహుమతులు గెలుచుకున్నారు. అలాగే పద్యాల విభాగంలో చిరంజీవి (చిట్యాల), కే గణేశ్ (టేకుమట్ల), ప్రవళిక (రేగొండ), పాటల విభాగంలో సౌజన్య, సుప్రియ, అంజలి, ఉపన్యాసంలో వైష్ణవి, విష్ణ్ణు, స్పందన వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించగా వాటిని అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో దేవా నాయక్, భూపాలపల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం లక్ష్మీప్రసన్న, బయోసైన్స్ ఫోరం అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను వినియోగించుకోవాలి

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 12 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని నిరుద్యోగులు ప్రభుత్వం తరపున నిర్వహిస్తున్న జాబ్‌మేళాలను వినియోగించుకొని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి అరూరి శ్యామల అన్నారు. సోమవారం పట్టణంలోని సుభాష్‌కాలనీ పాత ప్రగతి భవనన్‌లో ఏర్పాటు చేసిన మెగాజాబ్ మేళాకు హాజరైన ఆమె మాట్లాడారు. జిల్లాలోని నిరుద్యోగుల కోసం నాలుగు ప్రైవేట్ కంపెనీలతో నిర్వహించిన జాబ్‌మేళాకు 67మంది హాజరు కాగా, 32 మంది ఉద్యోగాలు పొందారని శ్యామల తెలిపారు. కార్యక్రమంలో ఆయా ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో పదోన్నతులు, బదిలీలు చేపట్టాలి

నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరైన ఉపాధ్యాయులు

కాటారం, ఫిబ్రవరి 12 : గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు నష్టపోకుండా వెంటనే పదోన్నతులు, బదిలీలు నిర్వహించాలని, ఆ తర్వాతనే నూతన నియామకాలు చేపట్టాలని ఉపాధ్యాయ ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు, అధ్యాపకులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జీవో 317ను తక్షణం పరిష్కరించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలని, అన్ని గురుకుల సంస్థలను ఒకే యాజమాన్యం కిందకు తెచ్చి ప్రతి జీవోను తప్పకుండా అమలు చేయాలని, గురుకులాల్లో ఒకే కాల నిర్ణయ పట్టిక, స్టాఫ్ పాటర్న్ ఉండేలా ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు, ప్రిన్సిపాల్ కే బుచ్చయ్య, జాయింట్ సెక్రటరీ రాజు, సిరిసిల్ల శ్రీనివాస్, ఉపాధ్యాయులు కల్పన, రాజయ్య, వంశీ, శ్రవణ్, సారయ్య, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి ఒకరు మృతి

ములుగు రూరల్, ఫిబ్రవరి 12 : బైక్ అదుపు తప్పి ఒకరు మృతి చెందిన ఘటన ములుగు మండలం భూపాల్‌నగర్ స్టేజ్ వద్ద ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు మండలంలోని దేవనగర్‌కు చెందిన గుగులోతు జవహర్‌లాల్ (50) పని నిమిత్తం తన ద్విచక్రవాహనంపై ములుగు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో భూపాల్‌నగర్ స్టేజ్ వద్ద ఎన్‌హెచ్ 163పై అదుపు తప్పి కింద పడగా తలకు తీవ్ర గాయమై అక్కడిక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డీడబ్ల్యూవోగా స్వర్ణలత

ములుగురూరల్, ఫిబ్రవరి 12 : ములుగు జిల్లా సంక్షేమ శాఖ అధికారి (డీడబ్ల్యూవో)గా జేఎం స్వర్ణలత లెనిన్‌ను నియమిస్తూ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సీడీపీవోగా పనిచేస్తున్న స్వర్ణలతకు ములుగు జిల్లా సంక్షేమ శాఖ అధికారిగా అదనపు బాధ్యతలను అప్పగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇక్కడ పనిచేసిన ఈపీ ప్రేమలతను అదనపు బాధ్యతల నుంచి తొలగించి ఏటూరునాగారం సీడీపీవోగా నియమించారు.

యాదవులకు గొర్రెలు పంపిణీ చేయాలి

ములుగురూరల్, ఫిబ్రవరి12 : డీడీలు కట్టిన 543మంది యాదవులకు వెంటనే గొర్రెలు పంపిణీ చేయాలని అఖిల భారత యాదవ మహాసభ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గిరిబోయిన రాజయ్యయాదవ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని గాంధీపార్క్ ఆవరణలో మద్దినేని తేజరాజుయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గొర్రెల కోసం 18 నెలల క్రితం డీడీలు కట్టారని, వారికి ఇప్పటి వరకు గొర్రెలు పంపిణీ చేయలేదన్నారు. ఒక్కో డీడీకి రూ.43,750 చొప్పున కట్టించుకున్నారన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం స్పందించి గొర్రెలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బైకాని సాగర్, చెదవాడ శ్రీనివాస్, వల్లాల నర్సయ్య, మాదం సాగర్, కుమార్, సాయి, కత్తుల కుమార్, మల్లేశ్ పాల్గొన్నారు.

పీఆర్‌సీ కమిటీకి వినతి పత్రం అందజేత

గణపురం, ఫిబ్రవరి 12 : సమాన పనికి సమాన వేతనం కల్పించాలని కోరుతూ సోమవారం పీఆర్‌సీ కమిటీకి మండలంలోని భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న తెలుగు, హిందీ, ఉర్దూ భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రమ దోపిడీకి గురువుతున్నారని అన్నారు. 20 ఏండ్లుగా పదోన్నతి లేదని, కమిటీ ప్రత్యేక చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని భాషా పండితుల మండలాధ్యక్షుడు బైరి నరసింహస్వామి కోరారు.

కొనసాగుతున్న దేవాదుల పంపింగ్

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 12 : మండలంలోని దేవాదులలోని ఐదు మోటర్ల ద్వారా గోదావరి నీటి పంపింగ్ కొనసాగుతున్నట్లు నీటిపారుదల